3 జిల్లాల్లో అమూల్ పాల సేకరణ

25న లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం

- కొత్త జిల్లాల ఏర్పాటుకు నిర్ణయం
- పరిపాలన సౌలభ్యం కోసమే
- మంత్రి అప్పలరాజు

ఒంగోలు, ప్రభన్యూస్ బ్యూరో : పాడి రైతులను కష్టాల నుంచి గట్టెక్కించాలనే ఉద్దేశ్యంతోనే అమూల్ సంస్థ ద్వారా రాష్ట్రంలోని మూడు జిల్లాల్లో పాలసేకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు పశుసంవర్ధక పాడి పరిశ్రమ, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు అన్నారు. జిల్లాకు వచ్చిన ఆయన బుధవారం కలెక్టరేట్‌లో మంత్రులు బాలినేని శ్రీనివాస రెడ్డి, ఆదిమూలపు సురేష్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రకాశం, చిత్తూరు, కడప జిల్లాల్లో ఈ నెల 25వ తేది నుంచి పాల సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులకు మేలు చేస్తూ వారి ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించడానికి అమూల్ సంస్థతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పాల సేకరణకు సంబంధించి ప్రభుత్వం ఈ నెల 25వ తేది లాంఛనంగా ప్రారంభించనుందని మంత్రి వెల్లడించారు. నిర్వీర్యమైన ప్రభుత్వ డెయిరీలను మనుగడలోకి తెస్తామన్నారు. రైతు భరోసా కేంద్రాల ఆధారంగా పాల సేకరణ కేంద్రాలు, బల్క్‌మిల్క్ ఛిల్లింగ్ కేంద్రాలను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందన్నారు. ఇందు కోసం ప్రభుత్వమే నిధుల వెచ్చిస్తుందని ఆయన వివరించారు.

రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పించడంతో మరింత మేలు జరుగుతుందన్నారు. ఆమూల్ సంస్థ సహకారంతో పాడి రైతుల ఆర్థిక వనరులు వృద్ది చెందుతాయన్నారు. సహకార సంఘాలలోకి మహిళా రైతులను చేర్చడం ద్వారా పలు ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. మహిళలే సంఘాలను నడుపుకునేలా విధి విధానాలు రూపొందించామన్నారు. అరకు పార్లమెంటుని రెండు జిల్లాలు చేయాలన్నది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనగా ఉందన్నారు. ముఖ్యమంత్రి ఆలోచనకు అనుగుణంగా జిల్లాల ఏర్పాటు పై నిర్ణయం ఉంటుందన్నారు. పార్లమెంటు నియోజకవర్గాల కేంద్రంగా జిల్లాలు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి గతంలో పాదయాత్ర సమయంలోనే హామీ ఇచ్చిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. పార్లమెంటు కేంద్రంగా జిల్లాలు ఏర్పటు చేస్తే పరిపాలన సులభతరమవుతున్నారు.కొత్త జిల్లాల ఏర్పాటు పై సోషల్‌మీడియాలో వస్తున్న వార్తలు సరైంది కాదని మంత్రి కొట్టిపారేశారు. సహకార సంఘాలతో పాల ఉత్పత్తిని పెంచడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. గతంలో దెబ్బతిన్న ప్రభుత్వ డెయిరీలను వినియోగంలోకి తెస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారని ఆయన అన్నారు. ఈ నెల 25వ తేది ప్రకాశం జిల్లాల్లో అమూల్ సంస్థ ద్వారా పాల ఉత్పత్తి సేకరణను రాష్ట్ర ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. దీంతో రైతుల ఇబ్బందులు తొలగిపోతాయని మంత్రి వివరించారు. సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, సంతనూతలపాడు ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు, జిల్లా కలెక్టర్ పోలా భాస్కర్ తదితరులు ఉన్నారు.

సీబీఐకి రికార్డులు అప్పగించండి

వివేక హత్యకేసుపై పులివెందుల మెజిస్ట్రేట్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఆంధ్రప్రభ: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించిన రికార్డులు అన్నింటిని సీబీఐకి అందజేయాల్సిందిగా హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు పులివెందుల మేజిస్ట్రేట్‌కు ఆదేశాలు జారీ చేసింది. వివేకానంద రెడ్డి హత్యకేసుకు సంబంధించిన రికార్డులను తమకు అప్పగించేలా పులివెందుల మేజిస్ట్రేట్‌ను ఆదేశించాలని కోరుతూ సీబీఐ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసింది. పైనుంచి తమకు ఆదేశాలు లేనందున రికార్డులు అప్పగించటం సాధ్యం కాదని పులివెందుల మేజిస్ట్రేట్ స్పష్టం చేసిన నేపథ్యంలో సీబీఐ హైకోర్టును ఆశ్రయించింది. సీబీఐ పిటీషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు బుధవారం ఈమేరకు రికార్డులు అప్పగించాల్సిందిగా పులివెందుల మేజిస్ట్రేట్‌ను ఆదేశించింది.

రాజధాని రైతులకు బెయిల్ మంజూరు

అమరావతి, ఆంధ్రప్రభ: రాజధాని ప్రాంతంలోని కృష్ణాయపాలెంకు చెందిన ఏడుగురు రైతులకు బుధవారం హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రైతులకు చేతులకు సంకెళ్లు వేసిన సంఘటన పై పెద్ద ఎత్తున దుమారం చెలరేగిన విషయం తెలిసిందే. మంగళగిరి మండలం కృష్ణాయపాలేం గ్రామానికి చెందిన ఏడుగురు రైతులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం.క్రింద కేసులు నమోదయ్యాయి. జిల్లా కోర్టులో బెయిలు లభించక పోవటంతో వారంతా హైకోర్టును ఆశ్రయిం చారు. రైతుల తరపున ప్రముఖ న్యాయవాది కారుమంచి ఇంద్రనీల్ బాబు వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లలిత వారికి బెయిల్ మంజూరు చేశారు. ఈ ఘటనకు సంబంధించి 8 వారాల్లోగా నివేదిక ఇవ్వాల్సిందిగా మానవహక్కుల కమిషన్ ఇప్పటికే ఆదేశించింది.

పట్టణాల్లో చేయూత బజార్లు

- కార్పొరేట్ సంస్థలతో భాగస్వామ్యం
- ప్రతి జిల్లా కేంద్రంలో మోడల్ బజారు
- మెప్మా మిషన్ డైరెక్టర్ వి. విజయలక్ష్మి

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో అమలవుతున్న వైఎస్ఆర్ ఆసరా, చేయూత పథకాల లబ్ధిదారులు ప్రముఖ కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యంతో పట్టణ ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు మెప్మా మిషన్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా కొనసాగుతూ ఆసక్తి ఉన్న చేయూత, ఆసరా పథకాల లబ్ధిదారులకు శిక్షణా కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. బుధవారం అన్ని జిల్లాల మెప్మా పథక సంచా లకులు, ప్రభుత్వం భాగస్వామ్యం కుదుర్చుకుంటున్న వివిధ కంపెనీల ప్రతినిధులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 110 మునిసిపాలిటీల్లో 34587 మంది చేయూత లబ్ధిదారులు దుకాణాల ఏర్పాటుకు ముందుకు వచ్చారని తెలిపారు.

లబ్ధిదారులు ఉత్పత్తి చేసిన అన్ని రకాల వస్తువులను చేయూత మెప్మా బజార్, జనతా బజార్ల ద్వారా విక్రయించుకునే వీలుకలుగుతుందన్నారు. దీని కోసం ఐటిసి, పి అండ్ జి, హిందుస్థాన్ యునీ లీవర్, రిలయన్స్ కంపెనీలు భాగస్వామ్య సహకారం అందిస్తాయనీ, ఆయా కంపెనీల ఉత్పత్తులు కూడా దుకాణాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. పేద మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. వీరికి క్షేత్ర స్థాయిలో బ్రాండ్ డిస్ట్రిబ్యూటర్లతో ఎలాంటి ఇబ్బంది లేకుండా బ్యాంకుల ద్వారా 56,250 రూపాయల వ్యాపార రుణం అందించేందుకు మెప్మా చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

కాంట్రాక్ట్ ఉద్యోగాలపై నియంత్రణ

- ఆర్థికశాఖ అనుమతి ఉన్న విభాగాల్లోనే కొనసాగింపు
- వచ్చే మార్చి నెలాఖరు వరకే
- మిగిలిన శాఖల్లో ఉద్యోగాల నిలిపివేతకు ఆదేశాలు

అమరావతి, ఆంధ్రప్రభ: ప్రభుత్వశాఖల్లో కాంట్రాక్ట్ ఉద్యోగుల కొనసాగింపును ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. కొన్ని శాఖల్లో అవసరానికి మించి ఉద్యోగులు పనిచేస్తున్నట్లు గుర్తించింది. ఆర్థికశాఖ అనుమతి లేకుండా ఏ ప్రభుత్వ విభాగంలోనూ కాంట్రాక్ట్ ఉద్యోగులను కొనసాగించవద్దని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఈ మేరకు ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ బుధవారం జీవో జారీ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం ఆయా శాఖల్లో పనిచేసే కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఈ ఏడాది జూన్ 30 వరకు గడువు విధించింది. తరువాత జూలై 31, ఆగస్టు 31వరకు గడువు పొడిగించింది.

ఆగస్ట్ నెలలో జరిగిన సమీక్షా సమావేశంలో ప్రభుత్వ శాఖలు, జిల్లాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల వివరాలపై నివేదిక అందించాలని ఆదేశించింది. అయితే కొందరు విభాగాధిపతుల నుంచి సమగ్ర సమాచారం అందక పోవటంతో ఇకపై కాంట్రాక్ట్ నియామకాలు చేపట్టవద్దని స్పష్టం చేసింది.

ఆర్థిక శాఖ అనుమతి పొందిన విద్య, వైద్యా రోగ్యశాఖ, యువజన సర్వీస్‌లు, టూరిజం, న్యాయశాఖల్లో కాంట్రాక్ట్ ఉద్యోగాల పదవీకాలాన్ని వచ్చే ఏడాది మార్చి 31 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. మిగిలిన శాఖలు, జిల్లాల్లో కాంట్రా క్ట్ ఉద్యోగులను అనుమతి లేకుండా కొనసాగిం చరాదని ఆదేశాలు జారీ చేసింది. హెచ్ఓడీలు, జిల్లాల వారీగా కాంట్రాక్ట్ ఉద్యోగుల కొనసాగిం పు, అవసరమైన సిబ్బందితో పూర్తి సమాచారం సిద్ధం చేయాలని ఆదేశించింది.

నాడు-నేడు పనులలో దోపిడీ



నర్సీపట్నం, ప్రభన్యూస్ : రాష్ట్రంలో అధికార పార్టీ అట్టహాసంగా ప్రారంభించిన నాడు-నేడు పనుల్లో వైసీపీ మంత్రులు, నాయకులు దోపిడీకి పాల్పడుతున్నారని మాజీ మంత్రి, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు అయ్యన్నపాత్రుడు బుధవారం విడుదల చేసిన వీడియో సందేశంలో విమర్శించారు. ప్రభుత్వం చెబుతున్నట్లు ఇది కొత్త కార్యక్రమం కాదని గత ప్రభుత్వ హయాంలో అనేక పాఠశాలలో గతంలో చేసిన పనులను ఇప్పుడు తిరిగి కొత్త రంగులేసి మరల ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అనేక అక్రమాలకు తెరలేపారని విమర్శిం చారు. రాష్ట్రంలో దాదాపు 10 వేల స్కూళ్లలో నాడు-నేడు పనులు జరుగుతా యని, టిడిపి పాలనలో జరిగిన రేగుల ప్రహరీగోడ నిర్మాణాలు మొక్కలు నాటడం లాంటి పనులు ప్రభుత్వం కొత్త పేరుతో నిర్వహిస్తుందన్నారు. ప్రస్తుతం జరుగు తున్న పనులు పెద్ద అవినీతి కంపు అని ఆరోపించారు. వైసిపి నాయకులు స్థానిక ఉపాధ్యాయుల మీద ఒత్తిడి తెచ్చి తమ బిల్లులను ఆమో దించుకొంటున్నారని అయ్యన్న తెలిపారు. వీటిని పర్యవేక్షిస్తున్న స్పెషల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ కచ్చితంగా విచారణ జరిపించి వాస్తవాలు ప్రజలకు తెలియ జేయాలని డిమాండ్ చేశారు. జరిగిన వాస్తవాలు స్వయంగా అధికార పార్టీ ఎమ్మె ల్యే జిల్లా డెవలప్మెంట్ కమిటీ సమావేశంలో వెల్లడించడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. వీఎంఆర్డిఎ పేరుతో పేదలకు ఇళ్లస్థలాలు సెంటు చొప్పున ఇవ్వడా నికి విశాఖపట్నంలో 4198 వేల ఎకరాల భూమిని ప్రభుత్వం తీసుకొని అది కూడా స్మశానంలోని మరియు లోతట్టు ప్రాంతాల్లో భూమిని సమీకరించి వాటిని చదును చేయడానికి 79 కోట్ల రూపాయలను నిధులు విడుదల చేశారని, వాటిలో 23 కోట్ల రూపాయలు అన్యాయంగా దోచుకు న్నారని, వీటి వెనక పెద్ద పెద్ద వైసీపీ నేతలు ఉన్నారని ఐఏఎస్ ఆఫీసర్ ప్రవీణ్ ప్రకాష్ విచారణ జరిపి వాస్తవాలు ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు.

18న స్వరూపానందేంద్ర జన్మదిన వేడుకలు

- ప్రత్యేకంగా హోమాలు నిర్వహణ
- భక్త బృందాల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు



విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో : విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్రసరస్వతి మహాస్వామి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు భక్తబృందాలు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నాయి. నాగుల చవితి పర్వదినం రోజున స్వరూపానందేంద్ర జన్మించారు. అందులో భాగంగానే ఈనెల 18న స్వరూపానందేంద్ర తన జన్మదిన వేడుకలు జరుపుకోనున్నారు. ఇందులో భాగంగా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి పర్యవేక్షణలో పీఠం వర్గాలు భారీగా ఏర్పాట్లు చేస్తున్నాయి. ఆ రోజు ఉదయం 8 గంటలకు మహాగణపతిపూజ, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. తదుపరి సుబ్రహ్మణ్యం స్వామికి అభిషేకం గావించనున్నారు. 9 నుంచి రుద్రక్రమార్చన, 10 గంటల నుంచి అవహంతీహోమం, ఆయుష్య హోమం జరిపిస్తారు. ఉదయం 10.30 నుంచి స్వామీజీకి పాదపూజ, బిక్షావందనం కార్యక్రమాలు నిర్వహించనుండగా ఆ తరువాత 11 గంటలకు స్వరూపానందేంద్ర భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణం నిర్వహిస్తారు. 11.30కు మహాపూర్ణాహుతి గావించి సాయంత్రం మూడు గంటలకు వేదసభ నిర్వహిస్తారు. సాయంత్రం నిరుపేద మహిళలకు వస్త్రదానం గావిస్తారు.

బాణాసంచా విక్రయాలపై ఆంక్షలు

దీపావళి సంబరాలపై సర్కార్ కీలక నిర్ణయం

అమరావతి, ఆంధ్రప్రభ: దేశంలోని పలు రాష్ట్రాలు తీసుకున్న నిర్ణయాల మాదిరిగానే రాష్ట్ర ప్రభుత్వం కూడా సంచలన నిర్ణయం తీసుకొంది. దీపావళికి రాష్ట్రంలో బాణాసంచా విక్రయాలను నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. కరోనా సెకండ్ వేవ్ విజృంభిస్తుండం నేపథ్యంలో బాణా సంచా కాలుష్యం వల్ల అది మరింత పెరిగే ప్రమాదం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. దేశంలో ఇదివరకే పలు రాష్ట్రా లు బాణాసంచా పేలుళ్లపై నిషేధం విధిస్తున్న విషయం తెలిసిందే. ఢిల్లీ, పంజాబ్, ఉత్తరప్రదేశ్, బెంగాల్, కర్నాటక వంటి రాష్ట్రాలు ఇప్పటికే అధికారిక ఉత్తర్వులు కూడా జారి చేసిన విషయం తెలిసిందే. ఇటీవలే జాతీయ హరిత ట్రిబ్యునల్ కూడా బాణసంచా వాడకాన్ని నిషేధించింది. తాజాగా ఆ జాబితాలో ఏపీ కూడా చేరింది. కరోనా భూతంతో దీపావళి టపాసుల విక్రయాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆంక్షలు విధించాలని నిర్ణయించింది. కేవలం రెండు గంటల పాటు మాత్రమే బాణ సంచా వినియోగంకు అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది. రాత్రి 8 గంటల నుండి 10 గంటల వరకు మాత్రమే టపాసులు కాల్చుకోవాలని సూచనలు చేసింది. కేవలం కాలుష్యరహిత టపాసులు మాత్రమే అమ్మకాలు జరపాలని ఆదేశించింది. ప్రతి షాపుకి మధ్య 10 అడుగుల దూరం ఖచ్చితంగా పాటించాలని ఆదేశించింది. షాపుల వద్ద కొనుగోలు దారుల మధ్య ఖచ్చితంగా 6 అడుగులు దూరం పాటించాలని సూచించింది. దీపావళి సామగ్రి అమ్మే షాపుల వద్ద శానిటైజర్ వాడొద్దని ప్రభుత్వం సూచించింది. దీంతో బాణసంచా వ్యాపారాలకు విక్రయాలకు పూర్తిగా బ్రేక్ పడినట్లేనని భావిస్తున్నారు. పిల్లలకు ఎంతో ఆసక్తికరమైన క్రాకర్స్ విక్రయాలపై ఆంక్షలు విధించడం పండుగ ఉత్సాహంతో ఉన్న వారి ఆశలపై నీళ్లు చల్లారని పలువురు భావిస్తున్నారు. ఇదిలావుండగా టపాసుల వ్యాపారాలకు ఎలాంటి అనుమతులూ ఇవ్వరాదని మండలాల్లో తహశీల్దార్ లకు మౌఖికంగా ఫోన్లులో ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. తాత్కాలిక అనుమతులు కూడా ఇవ్వొద్దని అధికారులకు సూచనలిచ్చినట్లు తెలుస్తోంది. దీంతో దీపావళి పండుగను ఇంటి వద్ద పూజలు పిండి వంటలకే పరిమితం కావాల్సివుంది.

రాష్ట్రంలో 1,732 పాజిటివ్ కేసులు

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో కరోనా ప్రభావం కొనసాగుతోంది. రాష్ట్రంలో కొత్తగా మరో 1732 కరోనా కేసులు నమోదయ్యాయి. 24 గంటల్లో 70,405 మంది నుంచి నమూనాలు సేకరించి పరీక్షలు చేయగా తాజా కేసులు బయటపడ్డాయి. దీనితో రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య 8,47,977 కి చేరుకుంది. ఇక తాజాగా 1761 మంది కరోనా నుంచి బయటపడ్డారు. ఈ క్రమములో రాష్ట్రంలో కరోనాతో కోలుకున్నవారి సంఖ్య 8,20,234 కు చేరుకుంది. ప్రస్తుతం రాష్ట్రము లో 20915 యాక్టీవ్ కేసులు ఉన్నాయి. ఇక రాష్ట్రంలో ఇప్పటివరకు 88లక్షల 63వేల కరోనా నిర్ధారణ పరీక్షలు గావించారు.

తెలంగాణలో 1,196 కొత్త కేసులు

తెలంగాణలో మంగళవారం రాత్రి 8 గంటల వరకు నిర్వహించిన కరోనా నిర్ధారణ పరీక్షల్లో కొత్తగా 1,196 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో ఇప్పటి వరకు నమోదైన కేసుల సంఖ్య 2,53,651కి చేరింది. మంగళవారం ఒక్కరోజే కరోనాతో ఐదుగురు మృతి చెందగా, మృతుల సంఖ్య 1,390కి చేరింది.

14న సింహగిరిపై దీపావళి వేడుకలు

- అదేరోజు నరకాసుర ఉత్సవం
- సాయంత్రం 5 వరకే భక్తులకు దర్శనాలు

విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో: సింహాచలం శ్రీ వరాహాలక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ఈనెల 14న దీపావళి పర్వదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. అదేరోజు సాయంత్రం గోవిందరాజు స్వాములు ఉత్సవ మూర్తులకు తిరువీది నిర్వహించి ఆలయ రాజగోపురం వద్ద నరకాసుర వధ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అయితే ఆ రోజు సాయంత్రం 5 గంటల వరకే భక్తులకు సింహాద్రినాధుడి దర్శనాలు కల్పిస్తున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఉత్సవం నేపధ్యంలో 5 దాటిన తరువాత భక్తులకు దర్శనాలు కల్పించడం లేదని కావున ఈ విషయాన్ని భక్తులు గమనించాలని కోరారు. నరకాసుర వధ ఉత్సవం అనంతరం సింహాద్రినాధుడికి ఆరాధన గావించనున్నారు.

రాష్ట్ర న్యాయబృందంలోకి జానకిరామిరెడ్డి

అమరావతి, ఆంధ్రప్రభ: జల వివాదాలకు సంబంధించి సుప్రీం కోర్టు వాటర్ ట్రిబ్యునల్‌లో ఉన్న కేసుల విచారణకు ప్రభుత్వం తరపున పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన న్యాయవాదుల బృందంలోకి సీనియర్‌న్యాయవాది కే జానకి రామిరెడ్డిని చేరుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యానాద్ దాస్ ఉత్తర్వులు జారీచేశారు. హైకోర్టు అడ్వకేట్ జనరల్ సూచన మేరకు ఆయన పేరును చేర్చినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జానకి రామిరెడ్డి వివాద రహితుడిగా, సౌమ్యుడిగా పేరు గడించారు. ఆయన 1988లో ఉమ్మడి ఏపీలో హైకోర్టులో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. ఈయ న 10 ఏళ్ల పాటు హోం, రెవెన్యూ శాఖలకు జీపీగా పనిచేశారు. కాగా, ఈయన మామ జీ వీరారెడ్డి 1980 దశకంలో ప్రముఖ న్యాయ వాదిగా రాష్ట్రంలో గుర్తింపు పొందారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖలకు ఆయన ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. ఇదే పోస్టును వీరారెడ్డి కూడా రాజశేఖర రెడ్డి హయాంలో పనిచేశారు. ఇప్పుడు మళ్లీ అదే పోస్ట్ కు జానకి రామిరెడ్డి నియమితులయ్యారు.

చెల్లింపులు ఇలా : ఆయనకు రిటైనర్ ఫీజు కింద నెలకు రూ.50 వేలు, కేసు నిమిత్తం హాజరైన సమయంలో రోజుకు రూ.1.25 లక్షలు, ఢిల్లీలో కాకుండా ఇతర చోట్ల సమావేశా లకు హాజరైతే రోజుకు రూ. 1.25 లక్షలు, ఢిల్లీలో సమావేశానికి హాజరైతే రోజుకు రూ. 35 వేలు, అనుబంధ పిటీషన్, కౌంటర్ దాఖలుకు రూ. 30 వేలు, పిటీషన్, అఫిడవిట్ తయారీకి రూ.70 వేలు వంతున చెల్లించాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

బిల్లులకోసం యూటీఎఫ్ నిరసనలు

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో డీఏలుఉ నిలుపుదల చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని, పెండింగ్ జీతాలు, పెన్షన్లు చెల్లించాలని, పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు, ర్యాలీలు నిర్వహించారు. విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. బాబురెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల అమలుకు చర్యలు తీసుకోవాలని, కేంద్రం పేరుతో డీఏలు నిలుపుదల చేయడం సరికాదని పేర్కొన్నారు. కార్యదర్శి ఎ. కృష్ణ సుందరరావు మాట్లాడుతూ పీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పెన్షనర్ల బెనిఫిట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్పీ మనోహర్ కుమార్, సహాధ్యక్షులు టి. సీతారామయ్య, కె. భగీరధ, కార్యదర్శులు సుందరయ్య, కార్యవర్గ సభ్యులు పూర్ణచంద్రరావు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీబీసీలో పోర్న్‌సైట్ల కలకలం

- సంబంధిత ఉద్యోగి తొలగింపు
- మరో నలుగురిపై చర్యలకు నిర్ణయం
- టీటీడీ విజిలెన్స్ పర్యవేక్షణలో ఎస్వీబీసీ

తిరుపతి, ప్రభన్యూస్‌బ్యూరో రాయలసీమ: తిరుమలేశుని భక్తి సంప్రదాయ వైభవాలను విశ్వ వ్యాప్తం చేసే లక్ష్యంతో ఏర్పాటైన శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ (ఎస్వీబీసీ) తాజాగా పోర్న్‌సైట్ల వివాదంలో చిక్కుకుంది.ఇటీవలి కాలంలో సాక్షాత్తూ ఛానల్ ఛైర్మన్ లైంగికపరమైన వివాదంలో చిక్కుకోగా తాజాగా ఎస్వీబీసీ ప్రతిష్టాత్మ కంగా నిర్వహించే ఒక కార్యక్రమానికి చెందిన అధికారిక మెయిల్ నుంచి పోర్న్ (నీలిచిత్రాల) సైట్ల దృశ్యాలు ఒక భక్తుడికి వెళ్లడం సంచలన వివాదంగా మారుతోంది. ఆ వివాదానికి పర్యవసానంగా ఎస్వీబీసీ కార్యాల యంలో దాడులు నిర్వహించిన టీటీడీ నిఘా సిబ్బంది నివేదిక ఆధారంగా అధికారులు బుధవారం సాయంత్రం సంబంధిత ఉద్యోగిని తొలగించారు. మరో నలుగురిపై చర్యలు తీసుకోనున్నట్టు కూడా ప్రకటించారు. ఎస్వీబీసీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే శతమా నంభవతి అనే కార్యక్రమంలో భాగంగా వినియో గించే అధికారిక మెయిల్స్‌ను నిర్వహించే ఉద్యోగి ఆనంద్‌కృష్ణ సమాచారం అడిగిన వెంకటకృష్ణ అనే భక్తుడికి శృంగార చిత్రాలతో కూడిన పోర్న్‌సైట్‌ను లింకు చేయడం వివాదానికి దారితీసింది. ఆ భక్తుడు ఆ విషయాన్ని తెలియచేస్తూ టీటీడీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, కార్యనిర్వహణాధికారి జవహర్‌రెడ్డిలకు మూడురోజులక్రితం ఫిర్యాదు చేసాడు. దానిపై జారీ అయిన ఉత్తర్వులతో టీటీడీ నిఘా సిబ్బంది రంగంలో దిగి రెండురోజుల పాటు దాడు లు కొనసాగించారు. పోర్న్‌సైట్ లింకు పంపిన కంప్యూటర్‌ను సీజ్ చేయడంతో పాటు వివిధ విభాగాల కంప్యూటర్లను పరిశీ లించి మరో నలుగురైదుగురు తమ విధులకు సంబం ధం లేని పనులకు వినియో గిస్తున్నట్టు,మరికొందరుపోర్న్‌సైట్లను చూస్తున్నట్టు కూడా గుర్తించారు. ఆ మేరకు మరో రెండు కంప్యూ టర్లను కూడా సీజ్ చేసి హార్డ్‌డిస్కులను స్వాధీనం చేసుకున్నారు.

పోర్న్ వీడియోలు పంపిన ఆనంద్ కృష్ణతో పాటు మరో ఇద్దరు ముగ్గురిపైనే కాక తమ విధులకు సంబం ధంలేని కార్యకలాపాలు చేస్తు న్నారని మరికొం దరిపైన ఆరోపణలతో కూడిన నివేదికను నిఘా విభాగం అధికారులు సమర్పిం చారు. ఆ నివేదిక ఆధారంగా ఆనంద్‌కృష్ణను ఉద్యో గం నుంచి తొలగించినట్టు ఎస్వీబీసీ సీఈఓ బుధవారం ప్రకటించారు. మరో నలుగురిపైకూడా క్రమశిక్షణచర్యలు తీసుకోవడానికి వీలుగా విచారణ చేపట్టిన ట్టు కూడా వెల్లడించారు.

దీంతో పాటు టీటీడీకి చెందిన 25 మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లతో ఎస్వీబీసీకి చెందిన కంప్యూటర్లను సెక్యూరిటీ ఆడిట్ చేయిం చారు. అన్నిటి మించి ఎస్వీబీసీ కంప్యూటర్ ఆపరేషన్ టీటీడీ ఐటి విభాగం పర్యవేక్షణలో కొనసాగించాలని, ప్రత్యేకంగా ప్రతి కంప్యూటర్ కు పాస్ వర్డ్ ఏర్పాటు చేయాలని, ఎస్వీబీసీని టీటీడీ నిఘా విభాగం పర్యవేక్షణలోకి తీసుకు రావాలని కూడా నిర్ణయిం చారు.

NELCAST LIMITED

CIN : L27109AP1982PLC003518

Regd. Office: 34, Industrial Estate, Gudur - 524 101. **Tel:** 08624 - 251266.
Fax: 08624 - 252066. **Wesite:** www.nelcast.com **Email:** nelcast@nelcast.com

STATEMENT OF UN-AUDITED STANDALONE AND CONSOLIDATED FINANCIAL RESULTS FOR THE QUARTER AND HALF-YEAR ENDED 30TH SEPTEMBER 2020

(₹ in lakhs)

Sl. No.	Particulars	Standalone						Consolidated					
		3 Months Ended			Half-Year Ended		Year Ended	3 Months Ended			Half-Year Ended		Year Ended
		30.09.2020	30.06.2020	30.09.2019	30.09.2020	30.09.2019	31.03.2020	30.09.2020	30.06.2020	30.09.2019	30.09.2020	30.09.2019	31.03.2020
		Un-Audited	Un-Audited	Un-Audited	Un-Audited	Un-Audited	Audited	Un-Audited	Un-Audited	Un-Audited	Un-Audited	Un-Audited	Audited
1	Total Income from Operations	13989.29	6600.18	12970.71	20589.47	31960.78	57733.57	13989.29	6600.18	12970.71	20589.47	31960.78	57733.57
2	Net Profit before tax from ordinary activities and Exceptional items *	627.93	-1110.14	478.19	-482.21	1524.51	3080.77	627.93	-1110.14	478.19	-482.21	1524.51	3080.77
3	Net Profit after tax from ordinary activities and Exceptional items *	466.57	-840.07	343.44	-373.50	1042.27	3600.51	466.57	-840.07	343.44	-373.50	1042.27	3600.51
4	Total Comprehensive Income for the period after tax	445.99	-856.91	339.79	-410.92	1029.76	3552.17	445.99	-856.91	339.79	-410.92	1029.76	3552.17
5	Equity Share Capital (Face Value of Rs.2/- each fully paid up)	1740.02	1740.02	1740.02	1740.02	1740.02	1740.02	1740.02	1740.02	1740.02	1740.02	1740.02	1740.02
6	Other Equity (as shown in the Audited Balance Sheet)						40278.29						40278.29
7	Earnings Per Share of Rs.2/- each (EPS for the Quarters are not annualised)												
	Basic	0.54	-0.97	0.39	-0.43	1.20	4.14	0.54	-0.97	0.39	-0.43	1.20	4.14
	Diluted	0.54	-0.97	0.39	-0.43	1.20	4.14	0.54	-0.97	0.39	-0.43	1.20	4.14

Notes :
The above is an extract of the detailed format of Financial Results filed with the Stock Exchange under Regulation 33 of the SEBI (Listing Obligations and Disclosure Requirements) Regulations, 2015. The full format of the Quarterly/Annual Financial Results are available on the Stock Exchange websites : **www.bseindia.com** and **www.nseindia.com** and on the Company's website **www.nelcast.com.**
* The Company does not have any Exceptional items to report in the above periods.

For Nelcast Limited

Place : Chennai
Date : 11.11.2020

P. Deepak
Managing Director